
# నందివర్ధనాలు

## కొకొని కమల

ఎక్కడికక్కడ తెగిపోయిన నవారు మంచంలో ఎండుకట్టెలా పడివున్నాడా నాలుగేళ్ళ బాబు. మూసిన కన్ను తెరవనంతగా జ్వరం. ఒళ్ళు సలసల్లాడి పోతూంది. ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు వాడి పాల చెక్కిళ్ళమీద చారికలు కట్టాయి.



వారం రోజులుగా మెతుకు ముట్టలేదు. గుక్కెడు పాలు కూడ సరిగా తాగటం లేదు. చిగురు మొగ్గల్లాంటి వాడి పెదాలు ఎండి బీటలు వారాయి.

ఇంజక్షన్ ప్రభావంతో మగతగా పడుకున్నాడు. ఆ మగత తగ్గి కాస్త మెలుకువ వస్తే చాలు ఒకటే ఏడుపు. ఏడుపు కాదా. పేచి..... రణ పేచీ.....

"నాకా దెపాను బొమ్మ కావాలి......

నాకా దెపాను బొమ్మే కావాలి....."

ఆ బొమ్మకోసం ఏడిచి ఏడిచి అలిసిపోతున్నాడు.

ఎదురుగా పంచప్రాణాలతో వాణ్ణి ప్రేమించే తల్లికంటె ఆ ప్రాణంలేని జపాను బొమ్మే వాడికి ఎక్కువ అయిపోయింది.. జ్వరపడ్డాడు. ప్రాణాలమీదికి తెచ్చుకొన్నాడు. నాలుగేళ్ళు నిండిన ముక్కుపచ్చలారని పసివాడు. వాణ్ణి ఎలా సముదాయించాలో పాతికేళ్ళ తల్లి సుజాతకి అర్థం కావటం లేదు.

ఆ బొమ్మ కోసం మనోవ్యథ పడి తీవ్ర జ్వరంతో మంచంపట్టాడు. ఆ జ్వరంలో ఆ మగతలో కూడా తెగ కలవరిస్తున్నాడు.

రెండుపూటలా డాక్టర్ వచ్చి వెడుతున్నాడు. వారం దినాలుగా వైద్యం నడుస్తూనే వుంది.

మొదటిరోజు డాక్టర్ చేతిలో ఓ పాతిక రూపాయలు పెట్టింది సుజాత. మళ్ళీ ఆయన చేతిలో డబ్బు పెట్టలేదు. వుంటే కదా పెట్టడానికి?

అయినా డాక్టర్‌గారు సుజాత పరిస్థితికి జాలిపడి మంచి మనసుతో మంచి వైద్యం చేస్తున్నాడు.

కాని చిన్నారి బాబుకి మందు ఒంటపట్టడం లేదు.

రోజురోజుకి వాడి ఆరోగ్యం క్షీణించిపోతూంది.

"డాక్టర్‌గారూ.

నా బాబుని ఎలా గైనా బ్రతికించండి. మీ ఋణం వుంచుకోను. మీ ఇంట్లో పాచిపని చేసి అయినా తీర్చుకుంటాను. బాబే నా జీవితానికి ఏకైక ఆశాకిరణం డాక్టర్‌గారూ!" వలవలా కన్నీరు కారుస్తూ చేతులు జోడించింది.

"అమ్మా మీ బాధ నాకర్థం అయ్యింది. మీ అబ్బాయి మరీ పసివాడు. చెప్పినా అర్థం చేసుకునే వయసు కాదు. వాడిది మామూలు జ్వరం అయితే ఈ పాటికి నేనే తగ్గించే వుండేవాడిని. కాని వాడిది మానసిక రుగ్మత. ఆ జపాను బొమ్మ ఏదో తెచ్చి వాడి చేతిలో పెడితేనేగాని వాడిరోగం తగ్గదు.

కోరుకున్నది ఇవ్వటమే మానసిక రోగానికి సరిఅయిన వైద్యం. ఇప్పటికైనా ఆ బొమ్మేదో తెచ్చి ఇవ్వండి. నా వైద్యం అవసరం లేకుండానే వాడి జ్వరం చిటికెలో తగ్గిపోతుంది."

సుజాత తలని మంచం కోడుకేసి కొట్టుకుంది.

కూటికిలేని దరిద్రురాలు. "నా" అనుకుందుకు ఎవరూ లేని దిక్కుమాలిన ఒక తల్లి తను. పదివేల దాకా విలువ చేసే ఆ జపాను బొమ్మని ఎక్కడ్నుంచి తెచ్చివ్వగలదు? ఎలా వాడి కోరిక తీర్చగలదు?

సుజాత అసహనంగా తల బాదుకుంది.

తల్లితండ్రిలేని అనాధ సుజాత. ఎందరి దయాదాక్షిణ్యాలమీదో పెరిగింది. చివరికి అలాంటి ఓ అభాగ్యుడిచేత తాళి కట్టించుకుంది. పెరిగిన పల్లె వదిలి పొట్ట చేత పట్టుకొని బ్రతుకుదెరువుకోసం పట్నం వచ్చారు. కడుపులో ఆకలి కరకరమంటున్న ఒకటిగా బ్రతికారు. కాని విధి సుజాత బ్రతుకులో ఆ కాస్త ఆనందం కూడా చూడలేకపోయిందేమో ఒక దుర్దినాన సుజాత భర్త పసిరికలు వచ్చి మరణించాడు. అప్పుడు సుజాత కడుపుతో వుంది. భర్తపోయిన నాలుగు నెల్లకి బాబుని ప్రసవించింది. ఆ సమయంలో సుజాత 'నా' అనుకున్న మనిషి లేక ఎంత అలమటించిపోయిందో ఆ దేముడికే తెలుసు. చదివింది పదవ తరగతి. ఆ చదువుకి ఉద్యోగాలు ఎక్కడ దొరుకుతాయి. చివరికి ఒక స్కూల్లో నర్సరి టీచరుగా పని దొరికింది. చదువు చెప్పేదేం లేదు. పిల్లల్ని ఆడించటం..... నెలకి ఏడువందల జీతం. వందరూపాయల అద్దెతో ఒక చిన్న రేకుల గదిలో నివాసం.

గతంలో అది ఒక కారు గ్యారేజి. కారు అమ్మేశాక దాన్ని చిన్న గదిగా చేశారు. అయినా సౌకర్యంగానే ఉంది. ఇంటిగలవాళ్ళు దూరంగా వేరే వూళ్ళో కొడుకుల దగ్గర ఉంటారు. నెలనెలా వాళ్ళ బంధువు వచ్చి అద్దెలు వసూళ్ళు చేసుకుని వెడతాడు. సుజాత పట్ల సానుభూతిగా ఉంటాడు. ఇంటివాళ్ళ వల్ల సుజాతకి ఎలాంటి ఇబ్బందులు లేవు. కాని సుజాతకి పక్కింటి మేడ యజమానితోనే ఇబ్బందులు కష్టాలు మొదలయ్యాయి.

రాజు మేడ పక్కన పేద పూరిగుడిసెలా సుజాత ఇల్లు.

రాజు పేరు రాయుడు. నిత్యం వీలు దొరికినప్పుడల్లా విధిగా రాజు పిట్టగోడ దగ్గర నించుని విదేశీ మద్యంతో ఎర్రబడ్డ కళ్ళతో తినేసేలా సుజాత కేసి చూస్తూ వుంటాడు.

ఉదయం సాయంత్రం విదేశీ మద్యం తాగటం, ఎర్రబడ్డ ఆ వాడి కళ్ళతో ఆడాళ్ళకేసి - అదీ సుజాత లాంటి దిక్కులేని ఆడవాళ్ళకేసి చూడటం - ఇంకా ఇష్టం అయిన హాబీ రాయుడికి. రాయుడి వయసు నలభై దాటింది. తెల్లటి పాల నురుగులాంటి సిల్కులాల్చి. పాలిస్టరు పంచె. మెడలో జిగిని గొలుసు. వేళ్ళనిండా నవరత్నాలు పొదిగిన ఉంగరాలు. చిన్న వయసులోనే భార్య పోయింది. అయినా రాయుడు పెళ్ళి చేసుకోలేదు. ఆడవాళ్ళ మనిషిగా రాయుడికి ఊరంతా చెడ్డ పేరుంది. ఎనిమిదేళ్ళ కొడుకున్నాడు. వాడి ముద్దు పేరు బంగారుకొండ. రాయుడికి పంచప్రాణాలు కొడుకే.

రాయుడికి ఊళ్ళో రైసుమిల్లుంది. ఊరి చివర పుట్లు పుట్లు పండే వరి పొలాలున్నాయి. ధాన్యం ఎగుమతి చేస్తాడు.

లంకంత మేడలో ఒంటరిగా ఉంటాడు. రాయుడి తల్లి బ్రతికేఉంది. వృద్ధురాలు. ఆ మేడలో ఏమూలో ఉంటుంది, వినిపించదు, కనిపించదు, ఆవిడకి. పదిహేనేళ్ళ కుర్రాడ్ని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. వాడు రెండు పూట్లా వంట చేస్తాడు. ఖాళీ టైమ్‌లో మిల్లుకో పొలానికో వెడతాడు. పనిమనిషి మిగతా పన్లు చేస్తుంది. రాయుడి కొడుకు బంగారుకొండ ఊళ్ళో వున్న ఇంగ్లీషు బడికి వెడతాడు. నాలుగవ తరగతి చదువుతున్నాడు. సవతి తల్లి వస్తే వాణ్ణి కష్టపెడుతుందేమోనని రాయుడు మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. అంతటి ప్రేమ రాయుడికి కొడుకుమీద. వాడికి చెయ్యని అపురూపం లేదు. తరచూ వ్యాపార నిమిత్తం రాయుడి స్నేహితులు ఎవరో ఒకరు విదేశాలకి వెళ్ళి వస్తూ ఉంటారు. వాళ్ళ చేత కొడుక్కోసం ఖరీదైన దుస్తులు, రకరకాల ఆటవస్తువులు, బొమ్మలు తెప్పిస్తూ ఉంటాడు రాయుడు. మంచిమంచి కామిక్సు పుస్తకాలు తెప్పిస్తూ ఉంటాడు.

అంతటితో ఆగితే ఫరవాలేదు.

కాని రాయుడి కొడుకు బంగారుకొండ ఆ బొమ్మలన్ని పట్టుకుని మేడ దిగుతాడు. చుట్టుపక్కల తన ఈడు పిల్లలందరికి ఆ బొమ్మలు చూపిస్తాడు. "కీ" ఇచ్చి వాటిని ఆడిస్తాడు. పాడిస్తాడు. "బటన్" నొక్కి డాన్సు చేయిస్తాడు. తన ఖరీదైన దుస్తుల్ని బూట్లని వాళ్ళందరికి చూపిస్తాడు.

సుజాత రేకుల షెడ్డు రాయుడి ఇంటి పిట్టగోడని ఆనుకుని వుండడంతో బాబుకి బంగారు కొండ గొప్ప ఆకర్షణ అయిపొయ్యాడు.

వాడి దగ్గర వున్నలాంటివన్నీ కావాలని నిత్యం పేచీ పెడుతూఉంటాడు బాబు.


వాణ్ణి ఓదార్చి నచ్చచెప్పేసరికి సుజాతకి తల ప్రాణం తోకకి వస్తుంది. సహనం చచ్చిపోతూంది. ఆ ఇల్లు మార్చెయ్యాలని చాలాసార్లు అనుకుంది. తనకి రాయుడి బాధ. తన కొడుక్కి ఆ బంగారుకొండ మైకం రెండూ వదిలిపోతాయి. ప్రశాంతంగా బతకవచ్చు అనిపిస్తుంది.

కాని పెరుగుతున్న ఆ ఊళ్ళో అంత చౌకగా మరొక గది దొరకటం కష్టం. పైగా ఇంటివాళ్ళు తనని సానుభూతిగా చూస్తారు. ఎప్పుడన్నా అద్దె నాలుగురోజులు ఆలస్యంగా ఇచ్చినా ఏమనరు. అలాంటి ఇంటిని ఒదులుకుంటే బయట బ్రతకటం కష్టం అందుకే సందేహిస్తోంది.

కాని రాయుడి కొడుకు బంగారుకొండ బాబు మనసుకి ముల్లులాగ తయారయ్యాడు. పైగా, భర్త అండదండల్లేని సుజాత అంటే రాయుడికి ఎనలేని లోకువ.

ఈ మధ్యనే ఒక నెలరోజుల క్రితం రాయుడు కొడుక్కోసం జపాన్నుంచి ఆడుకొనేందుకు చాలా ఖరీదైన ఒక మరబొమ్మ తెప్పించాడు. అలాంటి బొమ్మలు ఇప్పటికే బంగారుకొండకి చాలా ఉన్నాయి.

కాని ఈ జపాను బొమ్మ వాటన్నింటికి చాలా భిన్నంగా అచ్చం మనిషిలా ఉంది. పరిశీలనగా



చూస్తేనే గాని బొమ్మలా అనిపించటం లేదు. ఒక అడుగు ఎత్తులో వున్న జపాను సుందరి బొమ్మ విభిన్న అందంతో అత్యంత అద్భుతంగా ఉంది. పెద్దలకే వింతగొలిపేలా ఉంది.

"కీ" ఇస్తే చేతులు కాళ్ళు కదిలిస్తూ చక్కగా డాన్సు చేస్తుంది. ముందుకి వెనక్కి కదులుతుంది. తియ్యగా జపాను భాషలో పాట పాడుతుంది. మిలమిలా మెరుస్తూ మీనాల్లాంటి ఆ సుందరి కళ్ళు అచ్చం మనిషి కళ్ళలా అనిపిస్తాయి. పైగా ఆ బొమ్మ డాన్సు ఆడుతూ కొంటెగా ఒక కన్ను మూసి తెరుస్తుంది. అప్పుడు దాని ఎఱ్ఱ పెదవులు చిన్న నవ్వుతో ఒంపుగా విచ్చుకుంటాయి.

ఆ జపాను బొమ్మ గొప్ప అద్భుతంగా ఉంది. దాని ధర పదివేలదాకా వుండొచ్చని వాళ్ళ పనివాడు సుజాత అడిగితే చెప్పాడు. రాయుడికి తరగని నిధులున్నాయి. తినేవాళ్ళు తక్కువ. నల్లధనం ఏం చెయ్యాలో తెలియక కొడుక్కి కొండమీది వెండిగిన్ని చూపిస్తున్నాడు.

ఆ కొడుకు వాటన్నింటిని తన చుట్టుపక్కల పిల్లలకి చూపిస్తున్నాడు. ఆ చూపించటం ఆడించటమే సుజాత నాలుగేళ్ళ కొడుకు బాబుకి ప్రాణాంతకం అయ్యింది.

తమ దిక్కుమాలిన పేదరికంగాని, ప్రేమతప్ప పెన్నిధిలేని దీనురాలైన తల్లి గురించిగాని ఆ పసి మనసుకి తెలియదు. తెలిసిందల్లా ఒక్కటే...... కోరిక.

ఆ జపాను బొమ్మ తనకి కావాలి.

తను కూడా దానితో బంగారుకొండలా ఆడుకోవాలి.

పేచీ మొదలుపెట్టాడు.

ఏడుపు లంకించుకున్నాడు.

అది చివరికి దిగులుగా మారి మనోవ్యాధై . బెంగపడి మంచం పట్టాడు. ఆ బొమ్మ కలలరాణి అయిపోయింది.

ఏడంతస్తుల మేడలోని రాకుమారిని చూసి రోడ్డున పోయే బిచ్చగాడు వ్యామోహపడినట్లు.......

ఆ బొమ్మ బాబుకి ఎలా దొరుకుతుంది?

జ్వరంతో మంచం పట్టాడు బాబు.

వారం దాటిపోతూంది. చమురు ఇంకిపోతున్న దీపంలా బాబు కొడిగడుతున్నాడు.


"మనోవ్యాధికి మందు లేదు. రోగి మనసు పడినది ఇవ్వటమే మందు" అంటాడు వైద్యుడు.

కాని ఎలా?

"అమ్మా.... అమ్మా......."

సుజాత వులిక్కిపడింది.

మంచంలో ఎండువుల్ల కదిలినట్లు బాబు కదులుతున్నాడు.




"ఏంటిరా కన్నా? కొంచెం జావ తాగుతావా? ఇదిగో తియ్యగా ఉంటుంది, గ్లూకోస్ పాడి తింటావా? పోనీ పాలు తాగుతావా?" చిటికెడు గ్లూకోస్ పాడి తీసి వాడి నోట్లో వేసింది.

బాబు విసురుగా తల అటు ఇటు కదిలించాడు. వాడి కళ్ళనిండా నీళ్ళు.

"ఆ అ........నాకా దెపాను బొమ్మ కావాలి. నేను ఆ బొమ్మతో ఆడుకుంటా.... ఆ బొమ్మ నాది...

"భగవంతుడా?" సుజాత అరచేత్తో నుదురు కొట్టుకుంది.

సుజాతకి రాయుడిమీద గొంతు దాకా కోపం వచ్చింది. తనని బలి తీసుకోలేక తన బిడ్డని ఎర వెయ్యటానికి అలాంటి బొమ్మలు తెప్పిస్తున్నాడా, కావచ్చు. కొడుకు కోసం అయినా తను వాడి కాళ్ళ దగ్గరకి రాకపోతుందా అనుకుంటున్నాడా? వాడి కామపు కళ్ళకి తను వేట కాక తప్పదా?

సుజాత ఆవేశంగా మంచం దగ్గర్నుంచి లేచి రాయుడి మేడవైపుకి వున్న కిటికీ తలుపులు తెరిచింది.

అప్పటికే మసక చీకట్లు ముసురుతున్నాయి. రాయుడు ఎప్పటిలాగే పిట్టగోడ దగ్గర కూర్చున్నాడు. అయితే రోజులా పిట్టగోడ మీంచి ఒంగి సుజాత ఇంటికేసి కాంక్షగా చూడటంలేదు.

అటువైపుకి తిరిగి కూర్చున్నాడు. ఆయన చేతిలో పొడవుగా గ్లాసు దానినిండా మత్తుపానీయం. మరొకచేతివేళ్ళ మధ్య ఎఱ్ఱగా కాలుతున్న సిగరెట్టు.

రాయుడి ఎదురుగా ఇంకా ఎవరో కూర్చున్నట్టున్నారు. అటువైపు నుంచి తగ్గు స్వరంతో ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి.

రాయుడు గ్లాసు నోటి ముందు పెట్టుకొని కొంచెం తాగుతూ మధ్య మధ్య సిగరెట్టు పొగ పీల్చి వదులుతున్నాడు. సంభాషణ ఆ ఇద్దరి మధ్య కాస్త తీవ్రంగా వున్నట్లుంది. రాయుడు సుజాత ఇంటికేసి అస్సలు చూడటం లేదు. ఎదుటి వ్యక్తితో ఏదో ఆంతరంగికంగా మాట్లాడుతున్నాడు. డాబామీద ఇంకా ఎవరెవరివో మాటలు అడుగుల శబ్దాలు వినిపిస్తున్నాయి.

ఎప్పుడూ తాగుతూ ఎఱ్ఱకళ్ళతో మత్తుగా చూసే ఆ రాయుడు ఎదుటికి వెళ్ళి తన కొడుకుని రక్షించమని అడగాలా? ఒక ప్రాణంలేని బొమ్మ కోసం అటువంటి వాణ్ణి దేబరించటమా?

తన కొడుకుని రక్షించమని ఆ జపానుసుందరి బొమ్మ కావాలని అర్థిస్తే ఇస్తాడేమో.

కాని ఆ కామాంధుడు తననే కీలుబొమ్మని చేసి బ్రతుకంతా ఆడించడా?

అటువంటి స్త్రీ లోలుడికి లొంగి బతుకు తాకట్టు పెట్టేకంటే తను, తన కొడుకు చావటం నయం కదూ?

సుజాత దబ్బున కిటికీ తలుపు మూసేసింది. బొమ్మకోసం ఏడ్చి ఏడ్చి అలసి మూసినకన్ను తెరవకుండా మంచంలో మూలుగుతూ మృత్యువు ఒడిలోకి జారిపోతున్న కొడుకుకేసి ఒకసారి దైన్యంగా చూసి గబగబా వీధిలోకి వచ్చింది. వేగంగా అడుగులు వేస్తూ సందుచివర వున్న డాక్టరుగారింటికి వచ్చింది. గేటు తెరిచి ఇంటి చీడీలు ఎక్కి కాలింగ్ బెల్ మోగించింది.

డాక్టరుగారి భార్య వచ్చి తలుపు తీసింది.

సుజాత రెండు చేతులు జోడించింది.

"అమ్మా... డాక్టరుగారు ఉన్నారా.... మా బాబుకి ప్రాణాపాయంగా వుంది తల్లి. డాక్టరుగారు అర్జంటుగా కావాలి" ఆ పైన మాట రాలేదు సుజాతకి.

29వ పేజీ చూడండి

ఈ పక్షులకి ఎలాంటి హానీ తలపెట్టరు. ఈ పక్షుల గూళ్ళు ఇళ్ళ పైనుంచి చేతికందేంత దూరంలో ఉన్నా కూడా వాటి గూడ్లని తాకనైనా తాకరు. ఇంకా ఇతరులు ఎవ్వరూ ఈ పక్షులకి హాని చెయ్యకుండా జాగ్రత్త పడతారు. పెద్ద పక్షులు రోజూ దగ్గరలోని నౌపాడా దగ్గర సముద్రంలోంచి చేపలు తేవడానికి వెళితే, చిన్న పక్షులను గూళ్ళను చూసుకుంటారు. ఏ సంవత్సరమైనా ఈ పక్షుల వలస రాకపోతే, ఆ ఏడు గ్రామానికి అశుభం అని నమ్ముతారిక్కడి గ్రామస్థులు.

ఈ చుట్టు పక్కల, కోట బొమ్మాళి, వడ్డితాంద్ర, కాకర్లపాడు, దండుగోపాలపట్నం హాల్ట్, నౌపాడా, తిలారు వంటి ప్రదేశాల్లోనూ, ఇఛ్ఛాపురానికి దగ్గరైన తేలుకుంబిలోనూ కూడా మనకు అనేక పక్షులు కనిపిస్తాయి.

ఆంధ్రదేశంలో ఇంకా నేలపట్టు, పులికాట్ వంటి పక్షుల అభయకేంద్రాలు ఉన్నాయి. నేలపట్టుకి ప్రతి సంవత్సరం సుమారు 75 రకాల పక్షులు వలస వస్తే, శ్రీకాకుళం జిల్లాకి 2 లేక 3 రకాలు మాత్రమే వలస వస్తున్నాయి. ఈ సంఖ్య త్వరలో పెరగవచ్చు.

తేలినీలాపురం, వడ్డితాంద్ర, తేలుకుంచి ప్రదేశాలలో గూడబాతులు, ఎఱ్ఱజావడాలు ఎక్కువగా కనిపిస్తే, దండుగోపాలపట్నం హాల్ట్ వద్దా, కాకర్లపాడు వద్దా నత్త గుట్ట కొంగలు (OPEN BILLED STORKS) ఎక్కువగా కనిపిస్తాయి. కోట బొమ్మాళి, తిలారు వంటి చోట్ల తెల్ల కొంగలు (WHITE EGRETS) కనిపిస్తే, నౌపాడా దగ్గర సముద్ర తీరాన ఈ అన్ని రకాలూ, ఆహార సేకరణలో కనిపిస్తాయి.

గూడ బాతులనీ, ఎఱ్ఱ జావడాలనీ గ్రామస్థులు జాగ్రత్తగా చూసుకుంటే, నత్త గుట్ట కొంగలకు ఆ అదృష్టం లేదు. సుమారు 500 ఎకరాల ప్రదేశాల్లో విహరించే ఈ పక్షులు తరచూ వేటగాళ్ళ చేతుల్లో బలవుతున్నాయి. ప్రభుత్వం ఈ ప్రదేశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నది. కానీ, ఇంకా కొంచెం సిబ్బందిని పక్షుల సంరక్షణకు నియమిస్తే వేటగాళ్ళని కొంతవరకైనా అరికట్టవచ్చు.

తేలినీలాపురానికి 5 లేక 6 కి.మీ దూరంలో "ఎండ్లమల్లేశ్వరస్వామి" ఆలయం కూడా ప్రజాదరణ పొందుతోంది.

ఈ ప్రదేశాలకి టెక్కలి వరకూ బస్ వసతి ఉంది. అక్కడి నుంచి రిక్షాలలో గాని, ఆటో రిక్షాలలో గానీ ఈ ప్రదేశాలకు వెళ్ళవచ్చు. భోజనం మాత్రం టెక్కలిలోనే అనుకూలంగా ఉంటుంది. శ్రీకాకుళం నుంచి టెక్కలి సుమారు 52 కి.మీ. ఉదయం చీకటితో వెళ్తే, సాయంకాలానికి సందర్శన పూర్తి చేసుకుని తిరిగిపోవచ్చు.

**- కె. హేమంత్ కుమార్**

# ఉగాది పాట

వేపచెట్టు నిలువెల్లా వేయిమందులు
కోయిలమ్మ గొంతుకలో కోటి చిందులు
చేదైనా నలుపైనా ఏమి చిందులు!
పదిమందికి తోడైతే అదే ఉగాది!
సాగరాల అంతరాన కోటిజీవులు
బండరాతి గుండెలలో నీటిఊటలు
ఉప్పైనా రప్పైనా ఎన్ని సొగసులు!
ఒకరికింత నీడిస్తే అదే ఉగాది!
రఘుపలికే తోడైనది ఉడతసాహసం
గణపతినే మోస్తున్నది ఎలక వాహనం
చిన్నైనా చిరకైనా ఎంత గౌరవం!
అనుకున్నది సాధిస్తే అదే ఉగాది!

**- అవసరాల రామకృష్ణారావు**

---

నందివర్ధనాలు - 27వ పేజీ తరువాయి...

"అయ్యయ్యో. ఒక్క నిముషం వుండండి." అంటూ ఫోన్ దగ్గరికి వెళ్ళి నంబరు కలిపి మాట్లాడి తిరిగి సుజాత దగ్గరకి వచ్చింది.

"టీచర్‌గారూ! మీరు ఇంటికి వెళ్ళండి. డాక్టరుగారు రాయుడి గారింట్లోనే ఉన్నారు. మీరు వచ్చారని చెప్పాను. ఆయన మీ ఇంటికి వస్తున్నారు. మీరు వెళ్ళండి" అంది సానుభూతిగా డాక్టరుగారి భార్య

ఆత్రతగా తెరిచివున్న ఇంట్లోకి అడుగుపెట్టిన సుజాత కళ్ళు ఆశ్చర్యంగా తెరచుకున్నాయి.

బాబు మంచం పక్కనే ఉన్న చిన్న ముక్కాలిపీట మీద రాయుడు కూర్చుని ఉన్నాడు.

బాబు మంచంలో ఆనందంగా లేచి కూర్చుని ఆడుకుంటున్నాడు! వాడిచేతిలో జపాను బొమ్మ. ఆ జపాను సుందరి బొమ్మని రెండు చేతుల్తో గట్టిగా పట్టుకొని మాటి మాటికి గుండెలకి హత్తుకుంటున్నాడు. దాన్ని ముద్దులు పెట్టుకుంటున్నాడు.

పక్కన డాక్టరుగారు నిలబడి గ్లూకోజ్ కలిపిన నీళ్ళని బాబు నోటికి అందిస్తున్నాడు.

బాబు మారాం చెయ్యకుండా గటగటా గ్లాసుడు నీళ్ళు తాగేసి మళ్ళీ బొమ్మతో ఆడుకోవటంలో లీనం అయిపొయ్యాడు.

వాడి ముఖం జీవకళతో కళకళలాడిపోతోంది.

సుజాత కంఠంలోంచి ఆనందంతో వెర్రికేక రాబోయి ఆగిపోయింది.

వేగంగా గదిలోకి వచ్చిన తల్లిని చూస్తూ గభాలున మంచం దిగాడు. వెర్రి ఆనందంతో "అమ్మా..... దెపాను బొమ్మ....నాది.....నాదె దెపాను బొమ్మ" ఆనందం పట్టలేనట్లు తల్లి చేతులు పట్టుకుని గెంతులు వేశాడు.

చప్పున వాడ్ని రెండు చేతుల్తో గుండెకి హత్తుకుంది సుజాత.

"సుజాతగారు! ఇంక మీ అబ్బాయికేం ఫరవాలేదు. బలంగా వాడికి ఏమన్నా పెట్టండి. ఇంక నా వైద్యంతో పనిలేదు. వాడు కోరుకున్న బొమ్మ వాడికి దక్కింది" అంటూ మెడికల్ కిట్ తీసుకుని బయటికి నడిచాడు డాక్టర్.

"వాడు కోరుకున్న బొమ్మ వాడికి దొరికింది" డాక్టరుగారి మాటలు సుజాతకి ఎలాగో అనిపించాయి.

"మరి నేను కోరుకున్న బొమ్మ మాట ఏమిటి?" అని రాయుడు నిలదీస్తున్నట్టు - పులికి ఎర అయిన జంతువులా - భయంగా రాయుడి కేసి చూసింది.

రాయుడి కళ్ళు నందివర్ధనాల్లాగ అలాగే ఉన్నాయి. పైగా రెండు చేతులు జోడించాడు. దయగా అన్నాడు.

"టీచరమ్మా! ఆడవాళ్ళ విషయంలో నాకు బలహీనతలున్నమాట నిజమే. కాని పసివాణ్ణి అడ్డం పెట్టుకుని అవసరాలు తీర్చుకొనేటంతటి నీచగుణం నాకు లేదు. బాబు జపాను బొమ్మ కోసం బెంగపడి మంచం పట్టాడని డాక్టరుగారు వచ్చి చెప్పేదాకా నాకు తెలియదు. వెధవ ప్రాణం లేని బొమ్మకోసం పసిహాడ్ని ఎందుకు తల్లీ అంత కష్టపెట్టావ్. నువ్వు వచ్చి అడిగితే సంతోషంగా ఇచ్చేవాణ్ణి కదమ్మా. మా పనివానికి చెప్పినా పంపించేవాణ్ణి. పసివాళ్ళు దేముళ్ళు తల్లీ. వాళ్ళన్ని కష్టపెట్టేటంతటి కసాయితనం నాకు లేదు. పైగా పిల్లలంటే నాకు ఇష్టం. ఈ క్షణం నుంచి నువ్వు నాకు చెల్లితో సమానం. నీకెప్పుడు ఏ సహాయం కావాలన్నా ఈ అన్నని వచ్చి అడగొచ్చు...." అంటూ తలదించుకొని గబగబా గదిలోంచి వెళ్ళిపోయాడు రాయుడు.

కిలకిలా నవ్వుతూ జపానుసుందరి బొమ్మతో ఆడుకొంటూ గెంతులు వేస్తున్న కొడుకుని చూస్తుంటే కలో నిజమో అర్థం కాని అయోమయంలో అలాగే బొమ్మలా నిల్చుండిపోయింది సుజాత.

నందివర్ధనాల్లా కన్నీరు ఆమె చెక్కిళ్ళపై జారసాగింది. ❋